క్లుప్తంగా

ఖరీఫ్ యాక్షన్ ప్రణాళికపై శిక్షణ



శిక్షణకు హాజరైన వ్యవసాయ సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఐజీజీఏఏఎల్‌లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ఖరీఫ్ యాక్షన్ ప్లానింగ్‌పై జిల్లా అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి అధికారి సురేష్ మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ మీద శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, ఈ శిక్షణలో పీఎండీఎస్, విత్తన గుళికలు, తయారు చేసే విధానం, సీడ్ కిట్స్ తయారీ, మోడల్స్, రైతు వారీగా ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో టీం లీడర్ రమేష్, డీపీఎం ప్రవీణ్‌కుమార్, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఎన్ఎఫ్ఏలు, ఎంటీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి



పల్లెనిద్ర కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ

పెద్దముడియం : గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించేవిధంగా అందరు సహకరించాలని మైలవరం ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి దొడియంపల్లెలో ఆయన స్థానిక పార్టీ నాయకులతో, ప్రజలతో పల్లె నిద్రకార్యకమాన్ని నిర్వహించి మాట్లాడారు. రాజకీయ నాయకులు, ప్రజల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా మతపరమైన విషయాలు లేవనెత్తితే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరిపైన పోలీసుల నిఘా ఉంటుందన్న విషయాన్ని గ్రహించాలన్నారు. గ్రామంలో ట్రబుల్ మాంగర్స్, రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

కొనసాగుతున్న అక్రమ ముగ్గురాయి తవ్వకాలు



ముగ్గురాయి క్వారీలను పరిశీలిస్తున్న ఎస్ఐ మధుసూదనరావు(ఫైల్)

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమ ముగ్గురాయి తవ్వకాలు కొనసాగుతున్నాయి. టీడీపీ నాయకుల అండదండలతో టీడీపీ కార్యకర్తలు అక్రమంగా ముగ్గురాళ్ల తవ్వకాలను చేపట్టారు. ఎస్ఐ మధుసూదనరావు మైనింగ్ తవ్వకాల క్వారీల వద్దకు వెళ్లి హెచ్చరించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. టీడీపీ నాయకులు యథేచ్ఛగా ముగ్గురాయి తవ్వకాలను నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వేంపల్లె మండలంలో జరిగిన విధంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. మైనింగ్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని అక్రమ ముగ్గురాయి తవ్వకాలను నిలిపివేయాలన్నారు.

రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డాక్టర్, డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : రక్తదానంపై యువత అవగాహన కలిగి ఉండటంతోపాటు రక్తదానం చేయాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్ పాషా తెలిపారు. మంగళవారం స్థానిక ఆసుపత్రిలో స్వాతంత్ర్య సమరయోధులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన జరగబోయే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలంటూ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత రక్తదానం చేయడం వల్ల ఎటువంటి ఆరోగ్య సమస్యలు రావని ఇంకా ఉత్సాహంగా ఉంటారని సూచించారు. అనంతరం డీవైఎఫ్ఐ శివకుమార్ మాట్లాడుతూ 21న జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపులు

పులివెందుల టౌన్ : పట్టణంలో ఈనెల 19వ తేదీనుంచి 22వ తేదీవరకు ఆధార్ స్పెషల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. ఈనెల 19వ తేదీన రాజీవ్ కాలనీ, భాకరాపురం, 20వ తేదీన పెద్దకొండప్ప కాలనీ, వెంకటాపురం, 21న మిస్సమ్మ బంగ్లా, ప్రశాంతి నగర్, 22వ తేదీన నగరిగుట్ట, చెన్నారెడ్డి కాలనీల్లోని సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మద్దతు కరువై.. రైతు గుండె బరువై



కోల్డ్‌స్టోరేజీలో రైతులు నిల్వ ఉంచిన శనగలు



శనగను నూర్పిళ్లు చేస్తున్న కూలీలు



శనగలు

- గత ఏడాది కంటే తక్కువగా మద్దతు ధర
- అంతకంటే తక్కువ ధరకు అడుగుతున్న దళారులు
- పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదంటున్న శనగ, కంది రైతులు

ఎర్రగుంట్ల : ప్రకృతి వైపరీత్యాలు వెంటాడినా.. తెగుళ్ల చట్టుముట్టినా పంటలు కాపాడుకునేందుకు నానా ప్రయత్నాలు చేసిన రైతులకు ప్రభుత్వం మద్దతు ధర కరవైంది. శనగ, కంది కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నేటికీ ఏర్పాటు చేయలేదు. జమ్మలమడుగు డివిజన్‌లో శనగ 85,266 ఎకరాల్లో, కంది 11,471 ఎకారాల్లో సాగు చేశారు. శనగ, కంది పంటలను అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం క్వింటా శనగలు మద్దతు ధర రూ.5,650 ఇస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఇందులో సవాలక్ష నిబంధనలతో కొర్రీలు పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో బయట మార్కెట్‌లో దళారులకే రైతులు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది, కొందరు రైతులు దళారులు తక్కువ రేటుకు అడుగుతుండటంతో కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఒక రైతు కూడా శనగ పంట అమ్మకానికి రిజిస్ట్రేషన్ చేయించుకునే పరిస్థితి లేదు.

కందులను సొసైటీల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించగా రైతుల నుంచి కందుల శాంపిళ్లు సేకరిస్తున్నారు. ఈ ఏడాది సాగు చేసిన కంది పంటకు సంబంధించి పూత పిందే దశలో వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో దిగుబడిపై దెబ్బపడింది. దీంతో కందుల్లో నల్లగింజ రావడంతో పాటు దిగుబడి తగ్గింది. మిషన్లతో నూర్పిల్లు చేయడంతో నాణ్యతలో తేడా వచ్చింది. ప్రభుత్వం క్వింటా కందులకు మద్దతు ధర రూ.7,550 ప్రకటించగా కొనుగోలు కేంద్రాల చుట్టు తిరిగిన రైతులు ఏదో ఒక సాగు చెప్పి కొర్రీలు వేస్తుండటంతో దళారులకు అమ్మేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. ముద్దనూరు మండలంలో కంది కొనుగోలు కేంద్రం పెట్టినా రైతులు పెద్దగా ఆశ చూపలేదు. ఎందుకంటే ప్రభుత్వం నిర్ణయించిన కంది ధరలకు బయట మార్కెట్‌లో ధరలకు సమానం ఉండటంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నిరాశాజనకంగా ధరలు..

శనగ సాగుకు ఏటా పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. ఆ మేరకు ధరలు మాత్రం లభించడంలేదు. ఒక ఎకరా శనగ సాగు చేసేందుకు కనీసం రూ.20 వేల నుంచి రూ.25 వేలు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అయితే ధర ప్రస్తుతం క్వింటా రూ.5 వేలు పలుకుతోంది. తుఫాన్ ప్రభావంతో దిగుబడి 3-4 క్వింటాళ్లకే పరిమితం కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వంచనకే ప్రభుత్వం పరిమితం

వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు నష్టాల పాలవుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం కనిపించడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఏటా రూ.13 వేలను అందజేసింది. ప్రకృతి విపత్తుల సమయంలో రైతులను ఆదుకునేందుకు పైసా వసూలు చేయకుండానే ఉచిత పంటల బీమాను అమలు చేసేవారు. ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇస్తామని ప్రకటించినా నేటికి అమలు చేసిన పాపాన పోలేదు.

వ్యవసాయ శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు..

మండలం	శనగ (ఎకారల్లో)	కంది (ఎకారల్లో)
యర్రగుంట్ల	15000	1500
జమ్మలమడుగు	9593	1010
పెద్దమొడియం	36662	5100
మైలవరం	11310	711
ముద్దనూరు	2913	239
కొండాపురం	9788	2911
మొత్తం	85266	11471

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపని కూటమి



అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపలేదు. రైతులకు కనీసం మద్దతు ధర కల్పించలేదు. శనగ కొనుగోలు కేంద్రాలను ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. కంది కొనుగోలు కేంద్రం ముద్దనూరులో పెట్టిన ధరపై రైతులు ఆసక్తి చూపలేదు. పెట్టుబడి సాయం, రైతు భరోసా ఇప్పటి వరకు రైతులకు అందలేదు. రైతులను నిలువున మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

\- మేకల వీరభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ఎర్రగుంట్ల

పరిశుభ్రత పాటించాలి

కమలాపురం : గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని దేవరాజుపల్లెలో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చెత్తను రోడ్లపై వేయవద్దని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్త వేరు వేరుగా ఉంచాలన్నారు. అలాగే ఇళ్ల వద్దకు వచ్చే హరిత రాయబారులకు ఈ చెత్తను వేరు వేరుగానే ఇవ్వాలన్నారు. తద్వారా గ్రామం శుభ్రంగా ఉండటంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే మంచి నీటి సమస్య ఏమైన ఉందా? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో మంచి నీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్‌ను ఆమె ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పనులను పరిశీలించి మస్టర్స్ పరిశీలించారు. కూలీలకు అందే వేతనాలు, కావాల్సిన సదుపాయాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట లక్షుమ్మ, ఈఓపీఆర్‌డీ కెజియా, ఏపీఓ పార్థసారథి, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్యంపై అవగాన కల్పిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

విద్యుత్ ప్రమాదాలను నివారించండి



విద్యుత్ ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ రమణ

కమలాపురం : రైతులు, ప్రజలు, విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. మంగళవారం పట్టణంలో విద్యుత్ ప్రమాదాలు–నివారణ గురించి ప్రజలకు వీడియో రూపంలో ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించి విద్యుత్ ప్రమాదాలను నివారించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో, పంట పొలాలకు చుట్టూ విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయడం వలన వన్య ప్రాణులకు, మనుషులకు ప్రమాదం అన్నారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరం అన్నారు. ఇలాంటి కేసులు నమోదైతే 10 సంవత్సరాల జైలు శిక్ష, తీవ్రమైన జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మోటార్ పంప్ సెట్ యొక్క స్టార్టర్ వద్ద తేమ లేకుండా పొడిగా ఉండేలా చూసుకోవాలన్నారు. స్టార్టర్ ఆన్ లేదా ఆఫ్ చేసే సమయంలో చెప్పులు తొడగడంతో పాటు చేతికి రబ్బరు తొడుగులు ధరించాలన్నారు. మోటార్ పంప్ సెట్‌కు ట్రాన్స్‌ఫార్మర్‌కు మధ్య 20 నుంచి 30 మీటర్ల దూరం ఉండే విధంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని, అలాగే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు పొలంలో కొంత స్థలం కేటాయించి దాని వద్దకు జీవులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటిలో నిలబడి విద్యుత్ మోటార్లను స్విచ్‌లకు సంబంధించిన పరికరాలను తాకరాదన్నారు. ఈదురు గాలులు, వర్షాల వలన తెగిపడిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉంటూ వాటిని తాకకుండా సంబంధిత అధికారులకు లేదా దగ్గరలోని ఉప కేంద్రాలలో ఉండే సిబ్బందికి తెలియజేసి వారి ద్వారానే మరమ్మతులు చేసుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏఈ చాంద్‌బాషా, సబ్ ఇంజినీర్ సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే పాఠశాలకు 4 సెంటర్లు కేటాయింపు సమంజసమేనా?

కమలాపురం : పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలకు నాలుగు టెన్త్ క్లాస్ సెంటర్లు కేటాయించడం సమంజసమేనా? అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ ప్రశ్నించారు. మంగళవారం కమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలపై విద్యా శాఖ అధికారులకు అంత ప్రేమ ఎందుకో? ఒక పాఠశాలలోనే రెండు రెగ్యులర్, రెండు ఓపెన్ టెన్త్ క్లాస్ సెంటర్లు ఏర్పాటు చేయవచ్చా? అని ఆయన ప్రశ్నించారు. ఇక కమలాపురంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, గాని, కళాశాలలుగాని లేవా? అని పేర్కొన్నారు. గత ఏడాది టెన్త్ క్లాస్‌కు చెందిన 660 మందికి పైగా రెగ్యులర్ విద్యార్థులు కేవలం మూడు సెంటర్లలో పరీక్షలు రాసారని, ఈ ఏడాది 518కి ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం అవసరమా? అని ఆయన అన్నారు. అందులో ఒకే పాఠశాలకు రెండు రెగ్యులర్, రెండు ఓపెన్ సెంటర్లు మంజూరు చేయడం సమంజసమా? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారా? ఇలా ఒకే పాఠశాలకు నాలుగు సెంటర్లు మంజూరు చేయవచ్చా? అని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సెంటర్లలో 75 మంది విద్యార్థులు పరీక్ష రాస్తే, ప్రైవేట్ పాఠశాలల్లో ఉన్న సెంటర్లలో 100 మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాయడంలో ఆంతర్యమేమిటని ఆయన అన్నారు. ఇందుకు ప్రధాన కారణం కమలాపురం నియోజకవర్గంలో గత పదేళ్లుగా పని చేస్తున్నా మండల విద్యాధికారే అని ఆయన అన్నారు. అలాగే ఇతర ప్రాంతానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు బాయ్స్ హైస్కూల్ సెంటర్‌లో స్క్వాడ్ డ్యూటీ వేయించుకుని గురుకుల పాఠశాలలో తన కుమారుడు పరీక్ష రాస్తున్నందున అక్కడే విధులకు హాజరు కావడం ఏంటని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. అలాగే వెల్లటూరు, పెండ్లిమర్రి కస్తూర్బా పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని, జిల్లా విద్యాశాధి కారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలకు కేటాయించిన ఓపెన్ సెంటర్లను తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



పంచాయతీ సెక్రటరీకి వినతిప్రతం అందజేస్తున్న కాలనీ వాసులు

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన పాతకొండాపురం, ఎస్సీకాలనీ, కొండాపురం పునరావాస కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ జిల్లా అధికారులు తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించినా ఇక్కడ మాత్రం ముంపు గ్రామాల కాలనీల్లో నీళ్ల సమస్య తీవ్రంగా ఉంది. గండికోట జలాశయంలో కళ్ల ఎదుట నీళ్లున్నా మాకు మాత్రం తాగడానికి గుక్కడు నీటి కోసం అష్ట కష్టాలు పడుతున్నామన్నారు. కాలనీలో నీళ్ల సక్రమంగా రాలేదని వేసవి ఆరంభంలోనే నీళ్లకోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగు నీటి సమస్య ఉందని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ధర్నా చేపడుతామని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు పలువురు డిమాండ్ చేశారు.

నాటు సారా నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

పులివెందుల రూరల్ : నాటు సారా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరి సహాయం ఎంతో అవసరమని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో సారా తయారు చేస్తే వాటి వల్ల కలిగే నష్టాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నాటు సారా తయారు చేయడంవల్ల వాటిని తాగడంవల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నాటు సారాను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతుందన్నారు. అనంతరం ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ రవికుమార్ మాట్లాడుతూ నాటు సారా తయారీపై మాకు సమాచారం ఇవ్వాలన్నారు. నాటుసారాను తాగి మీ ఆరోగ్యాన్ని చిన్నాభిన్నం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, అర్బన్ సీఐ నరసింహులు, ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి, ఎస్ఐలు సాధిక్ హుస్సేన్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పెద్దముడియం : ప్రబోధ సేవా సమితి జ్ఞాన వేదిక జమ్మలమడుగు కమిటీ సభ్యులు మంగళవారం మండలంలోని చిన్న పసుపుల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. మార్గశిర మాసంలో ఎంతో భక్తి ప్రపత్తులతో ఉండాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రంగ నాయకలు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు : నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కాలేజిలో జరిగిన ఐటీ సమ్మిట్ కామరూన్‌లో పట్టణానికి చెందిన ఎస్పీడి గ్రీకాలేజి విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచినట్లు కరస్పాండెంట్ పాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సమ్మిట్ కామరూన్ కార్యక్రమంలో తమ విద్యార్థులు పేపర్ ప్రజెంటేషన్, కోడ్‌క్విస్ట్, టెక్నికల్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాల్లో సత్తాచాటడంతో ఓవరాల్ ఛాంపియన్లుగా బహుమతులు పొందారన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరామిరెడ్డి

కమలాపురం : భూ ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల తహసీల్దార్ శివరామిరెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీకి చెందిన దళితుల భూములు ఆక్రమణకు గురయ్యాయని, వారికి న్యాయం చేయాలని సీపీఐ నాయకులు ఈనెల 16వ తేదీన క్షేత్ర స్థాయిలో పర్యటించి విన్నవించారు. దీనికి స్పందించిన తహసీల్దార్ శివరామిరెడ్డి సోమవారం మండలంలోని ఎర్రబల్లె కొత్తపల్లె ఎస్సీ కాలనీ పర్యటించారు. ఆక్రమణకు గురయ్యాయని ఎస్సీ కాలనీ వాసులు ఆరోపిస్తున్న భూములను ఆయన పరిశీలించారు. ఇరు వర్గాల వారి వద్ద ఉన్న పత్రాలను తీసుకురావాలని సూచించారు. పత్రాలను పరిశీలించి ఎవరి వైపు న్యాయం ఉంటే వారికి న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుల భూములు ఎవరైనా ఆక్రమిస్తే వారికి పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ, ఇతర భూములు సైతం కబ్జాకు పాల్పడితే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

డ్రైవర్లు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఫిర్యాదులు వచ్చిన, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ల పనితీరు పైన ఆర్టీసీ అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. ఆర్టీసీ సంస్థకు ప్రమాద రహిత సంస్థగా పేరు ఉందని, అది ఒక్క డ్రైవర్లతోనే సాధ్యమైందన్నారు. ప్రతి డ్రైవరు విధుల్లో ప్రశాంతయుత మనస్సులో ఉండాలని, సకాలంలో ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అనంతరం బద్వేలు డిపో మేనేజర్ నిరంజన్ డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ పై సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే బ్లాక్ స్పాట్ పై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. అలాగే ఓం శాంతి సంస్థ ఆధ్వర్యంలో మానసిక ప్రశాంతత కోసం ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 24 మంది డ్రైవర్లు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్ వీధిలో ట్రాఫిక్ ఇబ్బందులు



మార్కెట్ వీధిలో నిలబడిపోయిన వాహనాలు

జమ్మలమడుగు : స్థానిక కూరగాయాల మార్కెట్ వీధిలో వాహనాల రద్దీతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పట్టణం నుంచే కాకుండా మండలంలోని గ్రామాల ప్రజలు కూరగాయాలు, ఇతర వస్తువులను కొనుగోలు చేయుటకు నిత్యం వేల సంఖ్యలో పట్టణానికి వస్తుంటారు. దీంతో మార్కెట్ వీధి నిత్యం రద్దీతో నిండిపోతోంది. ఈ వీధిలోనే ట్రాక్టర్లు కూడా తిరుగుతుంటాయి. రైతులు తాము పండించిన పంటలను మార్కెట్‌కు ప్రత్యేక వాహనాలలో తీసుకువస్తుంటారు. వస్త్ర వ్యాపారులు కూడా ఎక్కువగా ఈప్రాంతంలో ఉండటంతో లోడింగ్ అన్‌లోడింగ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. వ్యాపారులు తమ దుకాణాల వద్ద ఎటువంటి పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే నిలబెట్టి అన్‌లోడింగ్ చేస్తుంటారు. వాహనాలు ఎదురెదురుగా రావడంతో మరో వాహనం కదలలేని పరిస్థితి. దీంతో గంటల కొద్ది ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ ఈశ్వర్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కమ్మవారిపల్లి, అప్పరాజుపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు ఏఓ ఈశ్వరరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణలో భాగంగా ప్రతి రైతుకు ఆధార్ కార్డు నెంబరు తరహాలో 14 అంకెల విశిష్ట సంఖ్య ఇవ్వడం జరుగుతోంది. మండలంలోని పట్టాభూములు కలిగిన ప్రతి రైతు విశిష్ట సంఖ్య కోసం వారి పరిధిలోని రైతు సేవాకేంద్రాల వద్దకు ఆధార్ నెంబరు, పట్టాదార్ పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్ నెంబరుకు మొబైల్ నెంబరు అనుసంధానం కలిగిన ఫోను తీసుకుని వెళ్లి నమోదు చేయించుకోవాలని, డీకేటి భూములకు నమోదు కొరకు త్వరలో వెసులుబాటు వస్తుందని తెలిపారు.

మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ట్రిపుల్‌ఐటీ అధికారులు

వేంపల్లె : మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి రత్నకుమారి, సుస్మితాలు తెలిపారు. మంగళవారం ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై ర్యాలీ నిర్వహించారు. అలాగే వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థులు భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే మత్తు వ్యసనాలను పూర్తిగా నిరోధించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలవల్ల నేటి యువత అనేక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

వేంపల్లె : రేషన్ కార్డుదారులందరూ ఆయా డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్లతో సమావేశమయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈకేవైసీని డీలర్లు పూర్తి చేయాలని కోరారు. గతంలో ఈకేవైసీని కొంత మంది మాత్రమే చేసుకున్నారన్నారు. రేషన్ కార్డుల్లో ఉన్న కుటుంబ సభ్యులు అందరూ ఈకేవైసీని చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైసీని చేయించుకోని వారందరూ ఆయా రేషన్ షాపుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని కోరారు. ఈకేవైసీ చేయించుకోని వారి జాబితా డీలర్లు వద్ద ఉందన్నారు. గతంలో రేషన్ బియ్యం తీసుకుని వస్తున్న డీలర్లు వద్దకే వెళ్లాలని, ఈకేవైసీ చేయించుకోకపోతే ప్రభుత్వం అమలు చేసే పథకాలకు అర్హత ఉండదన్నారు. రేషన్ బియ్యంకు వచ్చినప్పుడు కార్డుదారులకు ఈకేవైసీపై ప్రజలకు తెలియ జేయాల్సిన బాధ్యత డీలర్లుదేనన్నారు. సకాలంలో ఈకేవైసీని పూర్తి చేయాలన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ భారాలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి అన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఏపీ ట్రాన్స్ కోకు 2014–19 కాలానికి సంబంధించి రూ.1050 కోట్లకు పైగా మిగులు వచ్చిందన్నారు. ఆ మేరకు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారులకు చార్జీలు తగ్గించబోతున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలు తగ్గించకపోగా రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందన్నారు.
ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కడప అసెంబ్లీ సమన్వయకర్త బండి జకరయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, చిన్నకుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.